ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

మన ప్రజాప్రతినిధి

తెలుగు దినపత్రిక

సంపటి : 4	సంచిక :16	హైదరాబాద్	ఆదివారం	నవంబర్ 15 2026	పేజీలు : 4 వేల : 2/

Published From:Telangana & Andrapradesh,Hyderabad & Vijayawada.Editar:G.Srinivas,epaper.manaprajaprathinidhi,com.

పెన్ పహాడ్ మండలంలో...

కలకలం కటింగ్‌ల పేరుతో దోపిడి



- ైతు కష్టాన్ని దోచుకుంటున్నారా..? మిల్లు యాజమాన్యం దందాపై బాధితుడి తిరుగుబాటు!
- క్వింటాకు రూ.3,700 ఇస్తామంటూ మాట తప్పి రూ.3,650కే పరిమితం.. కటింగ్‌ల పేరుతో అదనపు వసూళ్ల ఆరోపణలు!-
- అన్నదాత కష్టానికి దళారుల కత్తెర.. గౌరీ శంకర్ రైస్ మిల్లు ఎదుట రైతు ఆగ్రహం!
- ధాన్యం కొనుగోలులో మాయాజాలం.
- మాట ఒకటి చేతికి ఇచ్చేది మరొకటి!
- రైతు చెమటకు విలువ లేదా..?
- మిల్లులో అక్రమ కోతలపై బాధితుడి ఆగ్రహం!
- మద్దతు ధర మాటలకేనా..?
- తేమ, కటింగ్‌ల పేరుతో రైతులకు అన్యాయమా..?



మనప్రజాప్రతినిధి//పెన్‌పహాడ్:అన్నదాత ఆరుగాలం కష్టపడి పండించిన పంట.. మిల్లుకు చేరగానే దళారుల చేతిలో దోపిడీకి గురవుతోందా..? మాట ఇచ్చి మాట తప్పడం.. కటింగ్‌ల పేరుతో అదనపు కోతలు.. తేమ శాతం సాకుతో ధర తగ్గింపులు.. ఇవేనా రైతుకు దక్కుతున్న న్యాయం..?సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామ శివారులోని గౌరీ శంకర్ రైస్ మిల్లుపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. క్వింటాకు రూ.3,700 ఇస్తామని నమ్మించి, తీరా డబ్బులు చెల్లించే సమయానికి రూ.3,650 మాత్రమే ఇస్తామంటూ మాట మార్చారని బాధిత రైతు భూక్య వీరేందర్ నాయక్ ఆరోపిస్తున్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడాల్సిన మిల్లు యాజమాన్యం.. రైతు కష్టాన్ని దోచుకుంటున్నారా..? మిల్లు యాజమాన్యం దందాపై బాధితుడి తిరుగుబాటు! క్వింటాకు రూ.3,700 ఇస్తామంటూ మాట తప్పి రూ.3,650కే పరిమితం.. కటింగ్‌ల పేరుతో అదనపు వసూళ్ల ఆరోపణలు!- అన్నదాత కష్టానికి దళారుల కత్తెర.. గౌరీ శంకర్ రైస్ మిల్లు ఎదుట రైతు ఆగ్రహం! ధాన్యం కొనుగోలులో మాయాజాలం. మాట ఒకటి చేతికి ఇచ్చేది మరొకటి! రైతు చెమటకు విలువ లేదా..? మిల్లులో అక్రమ కోతలపై బాధితుడి ఆగ్రహం! మద్దతు ధర మాటలకేనా..? తేమ, కటింగ్‌ల పేరుతో రైతులకు అన్యాయమా..? డబ్బులు అడిగితే దురుసుగా వ్యవహరించడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు ధాన్యం ధరలో కోత.. మరోవైపు కటింగ్‌ల పేరుతో అదనపు భారం.. అసలు రైతు తన పంట అమ్ముకుని మిగుల్చుకునేది ఎంత..?రైతు పంట పండిస్తే లాభపడాల్సింది రైతు.. మధ్యలో మిల్లుల దందా నడిస్తే నష్టపోయేది అన్నదాతే!ఇంత జరుగుతున్నా సంబంధిత పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మిల్లులో కొనుగోలు రికార్డులు, తూకాలు, ధరల చెల్లింపులు, కటింగ్‌ల విధానంపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలి. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.అన్నదాతను ఆదుకోవాల్సిన వ్యవస్థే మౌనంగా ఉంటే రైతుకు దిక్కెవరు..? రైతు కష్టాన్ని దోచుకునే వ్యవహారాలపై అధికారులు ఇకనైనా కళ్లు తెరవాలి!

ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

సంపటి : 4	సంచిక :16	హైదరాబాద్	ఆదివారం	నవంబర్ 15 2026	పేజీలు : 4 వేల : 2/

Published From:Telangana & Andrapradesh,Hyderabad & Vijayawada.Editar:G.Srinivas,epaper.manaprajaprathinidhi,com.

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట ఎప్పుడు?



- ప్రతి క్షణం పొంచి ఉన్న ప్రమాదం..
ఆందోళనలో కుటుంబాలు
- అతివేగం, నిర్లక్ష్యంతో
ఆవిరవుతున్న నిండు ప్రాణాలు
- బాధిత కుటుంబాలకు జీవితాంతం
తీరని విషాదం
- రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరిలోనూ
పెరగాలి బాధ్యత

నవంబర్ 14 (మనప్రజాప్రతినిధి): మనిషి జీవితంలో ప్రయాణం ఒక భాగం. చదువు, ఉద్యోగం, వ్యాపారం, వైద్యం, కుటుంబ అవసరాలు.. ఇలా ప్రతిరోజూ ఏదో ఒక పని మీద రహదారులపైకి రావాల్సి ఉంటుంది. అయితే అదే రహదారులు కొన్నిసార్లు ప్రాణాలను బలిగొనే ప్రమాదకర ప్రదేశాలుగా మారుతున్నాయి. ఇంటి నుంచి సురక్షితంగా బయలుదేరిన వ్యక్తి తిరిగి క్షేమంగా వస్తాడో లేదోనన్న ఆందోళన కుటుంబ సభ్యులను వెంటాడుతోంది. క్షణకాలం నిర్లక్ష్యం, అతివేగం, అజాగ్రత్త కారణంగా ఎన్నో కుటుంబాల్లో విషాదం నెలకొంటోంది. ఒక రోడ్డు ప్రమాదం ఒక వ్యక్తి జీవితాన్నే కాదు.. అతడిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భవిష్యత్తును సైతం ప్రభావితం చేస్తోంది. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతుంది. చిన్నారులు తండ్రిని, తల్లిదండ్రులు తమ బిడ్డలను, భార్యాభర్తలు జీవిత భాగస్వాములను కోల్పోయి జీవితాంతం ఆ బాధను మోస్తున్నారు. అందుకే రోడ్డు ప్రమాదాలను కేవలం సాధారణ ప్రమాదాలుగా చూడకుండా, సమాజం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యగా గుర్తించాల్సిన అవసరం ఉంది.ప్రతి సంవత్సరం నవంబర్ నెలలోని మూడో ఆదివారం రోడ్డు ప్రమాద బాధితుల ప్రపంచ స్మారక దినోత్సవాన్ని నిర్వహిస్తారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడం, గాయాలతో జీవితాలను కొనసాగిస్తున్న బాధితులకు సంఘీభావం తెలియజేయడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. ప్రమాదాల కారణంగా కుటుంబాలు ఎదుర్కొంటున్న బాధలు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక సమస్యలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు ఈ రోజును పాటిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులకు కలిగే నష్టం ఎప్పటికీ పూడ్చలేనిది. ప్రాణాలు కోల్పోయిన వారిని తిరిగి తీసుకురాలేకపోయినా, భవిష్యత్తులో అలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడం మన చేతుల్లోనే ఉంది. ప్రమాదంలో గాయపడిన వారు ఎదుర్కొనే దీర్ఘకాలిక వైద్య సమస్యలు, ఉపాధి కోల్పోవడం, కుటుంబంపై పడే ఆర్థిక భారం వంటి అంశాలపై కూడా సమాజం దృష్టి సారించాలి. ఈ స్మారక దినం కేవలం గతంలో జరిగిన ప్రమాదాలను గుర్తుచేసుకోవడానికే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో రహదారులను సురక్షితంగా మార్చుకోవాలనే బాధ్యతను గుర్తు చేస్తుంది.రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో అతివేగం ఒకటి. గమ్యస్థానానికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో కొందరు వాహనదారులు వేగ పరిమితులను పట్టించుకోకుండా ప్రయాణిస్తున్నారు. ముందున్న వాహనాన్ని ప్రమాదకరంగా అధిగమించడం, రాంగ్ రూట్‌లో వెళ్లడం, ట్రాఫిక్ సంకేతాలను పట్టించుకోకపోవడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవింగ్‌పై నియంత్రణ తగ్గి ఇతరుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడటం, సందేశాలు చూడటం, సామాజిక మాధ్యమాలను వినియోగించడం కూడా ప్రమాదకరమే. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోకపోవడం వల్ల

2

మూడు బడ్జెట్లు దాటినా హామీల అమలేది?
హరీశ్ రావు

- రాహుల్ గాంధీకి మాజీ మంత్రి సూటి ప్రశ్నలు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులపై నిలదీత
- రాజీవ్ యువ వికాసం కాగితాలకే పరిమితమైందని విమర్శ
- రేవంత్ ప్రభుత్వాన్ని లెక్క అడగాలని డిమాండ్



హైదరాబాద్, నవంబర్ 14 (మనప్రజాప్రతినిధి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల అమలుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. పథకాలకు దివంగత మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల పేర్లు పెట్టినంత మాత్రాన వారికి గౌరవం ఇచ్చినట్లు కాదని, వారి పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చినప్పుడే నిజమైన గౌరవం లభిస్తుందని వ్యాఖ్యానించారు. అమలుకు నోచుకోని పథకాలకు మహనీయుల పేర్లు పెట్టి ప్రజలను మోసం చేయడం వారిని అవమానించడమేనని విమర్శించారు.ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై సమీక్ష నిర్వహించాలని హరీశ్ రావు కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు బడ్జెట్లలో చేసిన కేటాయింపులు, ప్రకటించిన హామీల అమలు తీరుపై వివరాలు అడిగి

2

కవిత పార్టీ కాంగ్రెస్‌కు నాలుగో అనుబంధ సంస్థ
ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

- తెలంగాణ రక్షణ సేనపై తీవ్ర విమర్శలు
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులే లక్ష్యంగా ఆరోపణ
- రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని విమర్శ
- కాంగ్రెస్‌కు అనుబంధంగా పనిచేస్తోందని వ్యాఖ్య



2

విజయవాడ లాడ్జిలో వివాహిత దారుణ హత్య

- అరగంటలోనే నిందితుడి పరార్
- సేల్స్ ఉమన్ ఎర్నమ్మ హత్యతో కలకలం
- ముందుగానే గదిని అద్దెకు తీసుకున్న నిందితుడు
- హత్య అనంతరం బాధితురాలి ద్విచక్రవాహనంతో పరార్
- సీసీటీవీ దృశ్యాల ఆధారంగా పోలీసుల గాలింపు

విజయవాడ, నవంబర్ 14 (మనప్రజాప్రతినిధి): విజయవాడలోని కృష్ణలంక ప్రాంతంలో ఉన్న ఓ లాడ్జిలో వివాహిత దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపుతోంది. సేల్స్ ఉమన్‌గా పనిచేస్తున్న పైడిశెట్టి ఎర్నమ్మ (35) లాడ్జిలో విగతజీవిగా కనిపించడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ హత్య కేసు దర్యాప్తులో పోలీసులు పలు కీలక విషయాలను గుర్తించారు. నిందితుడు ముందుగానే లాడ్జిలో గదిని అద్దెకు

2

కొత్త పోలవరం ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం
హోంమంత్రి అనిత

- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన హోంమంత్రి
- అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న అనిత
- నక్కపల్లి ఆసుపత్రిలో మృతుల కుటుంబాలకు పరామర్శ
- ముగ్గురి మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం

విశాఖపట్నం, నవంబర్ 14 (మనప్రజాప్రతినిధి): అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం కొత్త పోలవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద స్థలాన్ని ఆమె పరిశీలించి, ఘటనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరుతో పాటు మృతులకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం తనను

2

కాశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ ఆపరేషన్లపై సమీక్ష

- ఆపరేషన్ కాన్ఫరెన్స్, భద్రతా సమీక్ష సమావేశం
- లోయ ప్రాంత డీఐజీలు, కమాండింగ్ అధికారులతో చర్చ
- శ్రీనగర్ గ్రూప్ సెంటర్‌లో సమావేశం
- ఆపరేషన్లలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సత్కారం

2

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట ఎప్పుడు?




ప్రమాదాల సమయంలో గాయాల తీవ్రత పెరుగుతోంది. కొందరు యువకులు రహదారులపై వేగంగా వాహనాలు నడుపుతూ విన్యాసాలు చేయడం, పోటీపడటం వంటివి చేస్తున్నారు. రహదారి అనేది తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే ప్రదేశం కాదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. కొన్ని నిమిషాలు ఆలస్యంగా గమ్యస్థానానికి చేరుకోవడం పెద్ద సమస్య కాదు.. కానీ తొందరపాటు కారణంగా ప్రాణాలు కోల్పోతే ఆ నష్టం ఎవరూ పూడ్చలేరు.ప్రమాదాల నివారణలో ప్రభుత్వాల బాధ్యత కూడా కీలకమైనది. రహదారుల నిర్మాణం, నిర్వహణలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి. గుంతలు, ప్రమాదకర మలుపులు, సరైన సూచిక బోర్డులు లేని ప్రాంతాలను గుర్తించి అవసరమైన మార్పులు చేపట్టాలి. ముఖ్యంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పట్టణాల్లో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలి. పాఠశాలలు, ఆసుపత్రులు, జనావాసాల సమీపంలో వేగ నియంత్రణ చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలి. వాహనాల సామర్థ్యం, డ్రైవర్ల అర్హత, రహదారి భద్రతా ప్రమాణాల విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ అవసరమైన సాంకేతిక, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. అత్యవసర వైద్య సేవలు త్వరగా అందేలా అంబులెన్స్ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వైద్యం అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు పెరుగుతాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం ఎంత ముఖ్యమో, ప్రమాదం జరిగిన తర్వాత బాధితులకు సకాలంలో సహాయం అందించడం కూడా అంతే ముఖ్యమైనది.రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి శారీరకంగా కలిగే నష్టం కంటే కొన్నిసార్లు మానసికంగా ఎదురయ్యే వేదన ఎక్కువగా ఉంటుంది. ప్రమాదం కారణంగా కాళ్లు, చేతులు కోల్పోయిన వారు, శాశ్వత వైకల్యానికి గురైన వారు సాధారణ జీవితం గడపడానికి ఎంతో కష్టపడాల్సి వస్తుంది. ఉపాధి కోల్పోయి కుటుంబ పోషణ భారంగా మారిన సందర్భాలు కూడా ఉంటాయి. అలాంటి బాధితులకు వైద్య చికిత్సతో పాటు పునరావాసం, ఉపాధి అవకాశాలు, మానసిక సహకారం అందించాల్సిన అవసరం ఉంది. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయం, బీమా పరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి. మరోవైపు ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులకు సహాయం చేయడానికి ప్రజలు ముందుకు రావాలి. పోలీసుల విచారణ లేదా ఇతర ఇబ్బందులు ఎదురవుతాయనే భయంతో బాధితులను పట్టించుకోకుండా వెళ్లిపోవడం సరికాదు. అత్యవసర సేవలకు సమాచారం అందించడం, అందుబాటులో ఉన్న సహాయాన్ని అందించడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుంది. బాధితులను ఆదుకోవడం మానవతా బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలి.రోడ్డు భద్రత అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమాలతో సాధ్యమయ్యేది కాదు. చిన్నప్పటి నుంచే పిల్లలకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారిపై పాటించాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లల ముందు బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి ఆదర్శంగా నిలవాలి. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కారులో ప్రయాణించేవారు ముందు, వెనుక సీట్లలో ఉన్నా సీటు బెల్టు పెట్టుకోవాలి. మద్యం సేవించిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం నడపకూడదు. పాదచారులు కూడా రహదారిని దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. డ్రైవర్లు తమ వాహనాల వేగాన్ని పరిస్థితులకు అనుగుణంగా నియంత్రించాలి. రహదారిపై ఇతరులకూ సమాన హక్కు ఉందనే విషయాన్ని గుర్తించి పరస్పర గౌరవంతో ప్రయాణించాలి. రోడ్డు ప్రమాద బాధితుల ప్రపంచ స్మారక దినోత్సవం సందర్భంగా ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ, గాయపడిన వారికి సంఘీభావం తెలుపుదాం. ప్రతి ప్రయాణం సురక్షితంగా సాగాలంటే ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరం. వేగం కంటే ప్రాణం ముఖ్యం.. గమ్యం కంటే క్షేమంగా ఇంటికి చేరుకోవడం ముఖ్యం అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రమాదరహిత సమాజ నిర్మాణం కోసం వ్యక్తిగత బాధ్యతతో పాటు ప్రభుత్వ చర్యలు, ప్రజల భాగస్వామ్యం కలిసిరావాలి.

మూడు బడ్జెట్లు దాటినా హామీల అమలేది?హరీశ్ రావు



తెలుసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ ఎందుకు అమలు కాలేదో ముఖ్యమంత్రిని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ మూడు బడ్జెట్ల విధానం హామీలు ప్రకటించడం, గతంలో ప్రకటించిన వాటినే మళ్లీ కొత్త బడ్జెట్‌లో ప్రస్తావించడం, చివరకు నిధులు విడుదల చేయకుండా వదిలేయడంగా ఉందని హరీశ్ రావు ఆరోపించారు. బడ్జెట్ ప్రసంగాల్లో భారీ మొత్తాలు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వాటి అమలు కనిపించడం లేదన్నారు. ముఖ్యంగా పేద కుటుంబాలు, భూమిలేని వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని 2024-25 బడ్జెట్‌లో ప్రకటించారని గుర్తుచేశారు. 2025-26 బడ్జెట్‌లోనూ ఈ పథకం అమలుపై ప్రకటనలు చేసినప్పటికీ అర్హులైన కూలీలకు నేటికీ సాయం అందలేదని విమర్శించారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుద్యోగ యువతకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు రాజీవ్ యువ వికాసం పథకం కింద రూ.6 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు 2025-26 బడ్జెట్‌లో ప్రకటించారని, 2026-27 బడ్జెట్‌లోనూ అదే మొత్తాన్ని ప్రస్తావించారని తెలిపారు. అయితే నిధుల విడుదల, పథకం అమలు విషయంలో స్పష్టత లేదని ప్రశ్నించారు. మూడు బడ్జెట్లు గడిచినా పాత హామీలే మళ్లీ వినిపిస్తున్నాయని, ప్రభుత్వానికి జవాబుదారీతనం ఉండాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రాజకీయ నినాదాలు, ఉపన్యాసాలకు పరిమితం కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాహుల్ గాంధీని కోరారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ మూడు బడ్జెట్లపై తక్షణమే సమీక్ష జరిపి, అమలుకాని హామీలపై ముఖ్యమంత్రిని నిలదీయాలని సూచించారు. తెలంగాణ ప్రజలకు కావాల్సింది రాజకీయ జిమ్మిక్కులు కాదని, సుపరిపాలన, హామీల అమలేనని హరీశ్ రావు స్పష్టం చేశారు.

కవిత పార్టీ కాంగ్రెస్‌కు నాలుగో అనుబంధ సంస్థ
ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



హైదరాబాద్, నవంబర్ 14 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. కవిత పార్టీ కాంగ్రెస్‌కు నాలుగో అనుబంధ సంస్థగా పనిచేస్తోందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సింది పోయి, బీఆర్ఎస్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడమే ఆమె పనిగా పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు.ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావులను ఉద్దేశించి కవిత విమర్శలు చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయంలో ప్రతిపక్ష నాయకత్వంపై విమర్శలు చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. కవిత రాజకీయ వైఖరిపై ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై పోరాడాల్సిన బాధ్యతను విస్మరించి బీఆర్ఎస్ నేతలను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు వంటి అంశాలపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కవిత మాత్రం బీఆర్ఎస్ నాయకత్వంపైనే విమర్శలు కేంద్రీకరిస్తున్నారని పేర్కొన్నారు.తెలంగాణ రక్షణ సేన కాంగ్రెస్‌కు అనుబంధ సంస్థగా వ్యవహరిస్తోందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఆ పార్టీ రేవంత్ రెడ్డి సైన్యంలా పనిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా ప్రయోజనం చేకూర్చే విధంగా కవిత వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కవిత పార్టీని కాంగ్రెస్‌కు నాలుగో అనుబంధ సంస్థగా అభివర్ణిస్తూ ప్రవీణ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ నాయకత్వంపై కవిత చేస్తున్న విమర్శలు, వాటిపై ఇతర నేతలు స్పందిస్తున్న తీరు రాష్ట్ర రాజకీయాల్లో రాజకీయ వాదోపవాదాలకు దారితీస్తోంది.

విజయవాడ లాడ్జిలో వివాహిత దారుణ హత్య



తీసుకుని, పథకం ప్రకారం ఈ ఘటనకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు.ఎర్నమ్మ హత్యకు గురైన గదిని రాము అనే వ్యక్తి నవంబర్ 10వ తేదీనే అద్దెకు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత నవంబర్ 11న ఎర్నమ్మ ఆ లాడ్జికి వెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆమె లాడ్జిలోకి వెళ్లిన కొద్దిసేపటికే హత్యకు గురైంది. ఈ ఘటనకు సంబంధించి గది అద్దెకు తీసుకున్నప్పటి నుంచి నిందితుడి కదలికల వరకు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఎర్నమ్మను హత్య చేసిన అనంతరం నిందితుడు రాము అరగంటలోపే లాడ్జి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు గుర్తించారు. హత్య జరిగిన తర్వాత అక్కడ ఎక్కువసేపు ఉండకుండా బయటకు వచ్చినట్లు సీసీటీవీ దృశ్యాల ద్వారా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. దీంతో హత్య జరిగిన సమయం, నిందితుడు లాడ్జి నుంచి బయటకు వెళ్లిన సమయాన్ని సరిపోల్చుతూ దర్యాప్తు చేస్తున్నారు.లాడ్జి నుంచి బయటకు వచ్చిన తర్వాత నిందితుడు ఎర్నమ్మకు చెందిన ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం బస్‌స్టేషన్ సమీపంలో ఆ వాహనాన్ని వదిలిపెట్టి అక్కడి నుంచి పరారైనట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. నిందితుడు వాహనాన్ని ఎక్కడ వదిలాడు? అక్కడి నుంచి ఏ మార్గంలో వెళ్లాడు? అనే అంశాలపై పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు నిందితుడు రాము కోసం గాలింపు చర్యలు చేపట్టారు. లాడ్జిలోకి వచ్చినప్పటి నుంచి బయటకు వెళ్లే వరకు అతడి కదలికలను విశ్లేషిస్తున్నారు. ఈ హత్యకు గల కారణాలు, ఎర్నమ్మకు నిందితుడితో ఉన్న పరిచయం, ఘటనకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

కాశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ ఆపరేషన్లపై సమీక్ష



శ్రీనగర్, నవంబర్ 14 (మనప్రజాప్రతినిధి): జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు, బలగాల కార్యకలాపాలపై కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్ జి.పి. సింగ్ సమీక్ష నిర్వహించారు. శ్రీనగర్‌లోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో జరిగిన ఆపరేషన్ కాన్ఫరెన్స్, భద్రతా సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కాశ్మీర్ లోయలో విధులు నిర్వహిస్తున్న డీఐజీలు, కమాండింగ్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లోయలో కొనసాగుతున్న భద్రతా కార్యకలాపాలు, బలగాల వనితీరు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులపై చర్చించినట్లు సీఆర్‌పీఎఫ్ వెల్లడించింది. వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు తమ పరిధిలోని భద్రతా పరిస్థితులు, కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను సమావేశంలో వివరించారు. ఆపరేషన్ల నిర్వహణ, భద్రతా సమీక్షకు సంబంధించిన అంశాలపై చర్చ కొనసాగింది.ఆపరేషన్ కొరాగ్, ఆపరేషన్ అష్ధర్ సందర్భంగా ధైర్యసాహసాలు, అంకితభావం, నిర్ణయాత్మక చర్యలు ప్రదర్శించిన సిబ్బందిని జి.పి. సింగ్ ఈ సందర్భంగా అభినందించారు. ఆయా ఆపరేషన్లలో పాల్గొన్న బలగాల సేవలను గుర్తించి ప్రశంసించారు. క్లిష్ట పరిస్థితుల్లో విధి నిర్వహణలో చూపిన తెగువ, బాధ్యతాయుతమైన చర్యలను ప్రత్యేకంగా ప్రస్తావించారు.ఆపరేషన్లలో పాల్గొన్న టీఓబీల సిబ్బందిని ఆయన సత్కరించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యం, అంకితభావానికి గుర్తింపుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. బలగాల సేవలను ఉన్నతాధికారులు గుర్తించి అభినందించడం ద్వారా సిబ్బందిలో మరింత ప్రోత్సాహం కల్పించే ప్రయత్నం చేశారు. సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి కమాండింగ్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశం ద్వారా కాశ్మీర్ లోయలో భద్రతా కార్యకలాపాలపై సమీక్ష చేపట్టారు. ఆపరేషన్ కొరాగ్, ఆపరేషన్ అష్ధర్‌లో పాల్గొన్న సిబ్బందిని సత్కరించడం ఈ సమావేశంలో ప్రధాన అంశంగా నిలిచింది.

కొత్త పోలవరం ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం
హోంమంత్రి అనిత



తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న హోంమంత్రి అనిత మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆప్తులను కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జరిగిన ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అనిత పేర్కొన్నారు. ప్రమాదం కారణంగా కుటుంబాల్లో ఏర్పడిన విషాదం తనను కలచివేసిందని తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఈ క్లిష్ట సమయంలో వారికి ప్రభుత్వం తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హోంమంత్రి స్పష్టం చేశారు. ప్రమాద ఘటనపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు, బాధిత కుటుంబాల పరిస్థితిని పరిశీలించారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. ముగ్గురి మరణంతో కొత్త పోలవరం ప్రాంతంలో విషాదం నెలకొంది. ప్రమాద స్థలాన్ని స్వయంగా పరిశీలించి, అనంతరం ఆసుపత్రిలో బాధిత కుటుంబాలను పరామర్శించడం ద్వారా హోంమంత్రి అనిత వారికి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మరోసారి స్పష్టం చేశారు.

హుజూర్ నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఘనంగా జెండా ఆవిష్కరణ



మన ప్రజాప్రతినిధి//హుజూర్ నగర్ ,నవంబర్ 14:అంతర్జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా హుజూర్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం శనివారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జక్కుల నరేందర్ యాదవ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో సంఘానికి రూ.25 లక్షల స్వల్పకాలిక రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ రుణాలు పూర్తిగా చెల్లించిన తర్వాత తిరిగి కొత్త రుణాలు ఇస్తామని చెప్పారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు కావలసిన సంఘం ద్వారా పొందవచ్చని సూచిస్తున్నారు. అలాగే సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమైనందున, రైతులు ఈ సద్వినియోగం చేసుకొని కనీస మద్దతు ధర పొందాలని ఆయన నిర్ణయించారు.

తూప్రాన్ లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా కమిటీ ఎన్నిక



మెదక్ జిల్లా//మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక 14/11/2026 USFI నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గా నవీన్,జగన్ ఎన్నిక తూప్రాన్ లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా కమిటీ ఎన్నిక మెదక్ జిల్లా తూప్రాన్ మండలం లో ముఖ్య కార్యకర్తల సమావేశం జగన్ అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా యు ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సందీప్ పాల్గొని మెదక్ జిల్లాలో విద్య రంగ సమస్యల పై చర్చించడం జరిగిందనీ వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ సమస్యలు పరిష్కరించే దిశగా జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో యు ఎస్ ఎఫ్ ఐ మెదక్ జిల్లా నూతన కమిటీనీ 14 మందితో నియమించడం జరిగిందాని జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా నవీన్, జగన్ ఎన్నిక చేయడం జరిగిందని వర్కింగ్ ప్రెసిడెంట్ గా సోముల అజయ్, సహయ కార్యదర్శులుగా రేహాన్, శ్రీకాంత్, సిందుజ జిల్లా కమిటీ సభ్యులు అజయ్, రాజేష్, చింటూ, సిద్దు, అక్షర,లావణ్య, దీక్షిత్ ,కర్ణకర్ వీరితో జిల్లా కమిటీ ఎన్నిక జరగడం జరిగిందని అన్నారు నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ... మెదక్ జిల్లా లో విద్య రంగ సమస్యల పై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని విద్యార్థులు మంచి మార్గంలో నడిచే విధంగా స్కూల్స్, కళాశాలలో సదస్సులు నిర్వహించడం జరుగుతుందనీ మా మీద నమ్మకంతో నియమించిన రాష్ట్ర కమిటీకి అభినందనలు తెలిపారు.

చేగుంటలో విషాదం.. మాజీ జడ్పీటీసీ ఆకుల సిద్ధిరాములు కన్నుమూత

నివాళులు అర్పించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



మన ప్రజప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట నవంబర్ 14: చేగుంట మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల సిద్ధిరాములు మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఆయన గతంలో మూడు పర్యాయాలు ఏకగ్రీవంగా గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ప్రజలకు విశేష సేవలందించారు.సర్పంచ్‌గా, జడ్పీటీసీగా పనిచేసిన సమయంలో గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి, చేగుంట ప్రాంతానికి తీరని లోటని దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.ఆయన మృతి విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం అతని భౌతికాయాన్ని డప్పు చప్పులతో కుల మతాలకు అతీతంగా అంతిమయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమం లొ సర్పంచ్ మహేశ్వరీ సాయిబాబా,ఉప సర్పంచ్ నగేష్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముజామిల్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రజనకు ప్రవీణ్,కార్యదర్శి భాగ్య రాజు,వార్డ్ సభ్యులు యాదగిరి,మధు,తదితరులు పాల్గొన్నార



బిఆరెస్ టిఆర్ఎస్ బిజెపి తోడుదొంగలు



మనప్రజాప్రతినిధి//నవంబర్ 14 సిద్ధిపేట.: 10 సంవత్సరాలు కెసిఆర్ చేర నుంచి విడిపించి కాంగ్రెస్ ప్రభుత్వంకు ప్రజలు పట్టం కట్టారు కవిత సిద్ధిపేట పేరుతో దోచుకుంది తప్ప చేసింది ఏమీ లేదు బిఆరెస్ టిఆర్ఎస్ కు మునిసిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవనివ్వ వద్దు సిద్ధిపేట మునిసిపల్ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరి కాంగ్రెస్ కు మద్దతు ప్రకటించాలి. సిద్ధిపేటలో సీఎం రేవంత్ రెడ్డి గారి సభను విజయవంతం చేయాలి. సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమశీ.బిఆరెస్ టిఆర్ఎస్ బిజెపి పార్టీలు తోడుదొంగలు అని అధికారం పోయి ఒకరు అధికారంలోకి రావాలి అని గుంటనక్కలు లాగా ఎదురు చూస్తున్నారు అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేట లో ఏర్పాటు చేసిన సమావేశంలో సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ బిఆరెస్ నుంచి బయటకు వచ్చిన కవిత ప్రజల దృష్టిని మరలిచేందుకు టిఆర్ఎస్ పార్టీ పెట్టారు అని అన్నారు. మళ్లీ కెసిఆర్ ను అధికారంలోకి తెచ్చేందుకు బీజేపీ బిఆరెస్ కవిత పార్టీలు కుట్రలు చేస్తున్నారు అని అన్నారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు అందరూ కలిసి నాటకాలు ఆడుతున్నారు అని అన్నారు. బయటకు ఒకరికి ఒకరు తిట్టుకున్న వారిది కల్వకుంట్ల కుటుంబమే అని ఎద్దేవా చేశారు. బిఆరెస్ పోయి టిఆర్ఎస్ వచ్చిన తెలంగాణ కోసం చేసి ఏమీ లేదు అని వాళ్ళిద్దరూ కలిసి అధికారం చేయాలని చూస్తూ ఉన్నారు అని అన్నారు. 10 సంవత్సరాలు కెసిఆర్ కుటుంబం లక్షల కోట్లు రూపాయలు దోచుకున్నది సరిపోక మళ్లీ దోచుకోవాలి అని చూస్తూ ఉన్నారు అని మండిపడ్డారు. 10 సంవత్సరాలు కెసిఆర్ చేర నుంచి విడిపించి కాంగ్రెస్ ప్రభుత్వంకు ప్రజలు పట్టం కట్టారు అని కానీ కెసిఆర్ కుటుంబం మళ్లీ ప్రజలను మోసం చేయాలి అని చూస్తున్నారు అని వారి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దు అని అన్నారు. కవిత సిద్ధిపేట పేరుతో దోచుకుంది తప్ప ఆమె చేసింది ఏమీ లేదు అని మునిసిపల్ ఎన్నికల్లో పోటీచేసి గెలుస్తాం అని పగటి కలలు కనవద్దు అని అన్నారు. బిఆరెస్ టిఆర్ఎస్ కు మునిసిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవనివ్వ వద్దు అని రాబోయే సిద్ధిపేట మునిసిపల్ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోరి కాంగ్రెస్ కు మద్దతు ప్రకటించాలి అని అన్నారు. వచ్చే మునిసిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపిస్తే అన్నీ వార్డులు అభివృద్ధి చేస్తాం అని అన్నారు. ఈనెల 29న సిద్ధిపేటలో సీఎం రేవంత్ రెడ్డి గారి సభకు ప్రజలు వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలు స్వచందంగా తరలివచ్చి కార్యక్రమంను విజయవంతం చేయాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్యాదారి మధు గయాజుద్దీన్ ఫయాజ్ నవాజ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో కవిత యాక్షన్!

కవిత కాంగ్రెస్ కు బి టీమ్ అంతరాత్మ!



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నవంబర్ 14 చిన్నకోడూరు: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హరీష్ రావుపై చేస్తున్న ఆరోపణలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాముని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, సర్పంచ్ ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు కాముని ఉమేష్ చంద్ర, రైతు బంధు జిల్లా మాజీ డైరెక్టర్ మేడికాయల వెంకటేశం, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, కొండం రవీందర్ రెడ్డి, సర్పంచ్ లు ఇట్టబోయిన శ్రీనివాస్, రేగుల దేవయ్య, పుచ్చకాయల సురేందర్ రెడ్డి లతో కలసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహానికి అనుగుణంగానే కవిత వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాముని శ్రీనివాస్ ఘాటుగా విమర్శించారు.ఈరోజు కవిత మాట్లాడుతున్న మాటలే రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడబోతున్నారా? అనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. లిక్కర్ కేసు వ్యవహారంలో రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కవిత సన్నిహితంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో రాజకీయ సంబంధాల దిశగా కవిత ప్రయాణం సాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.హరీష్ రావుపై ఆరోపణలు చేసే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలి!తెలంగాణ ఉద్యమ చరిత్ర, ఉద్యమ నాయకుల త్యాగాలు, రాజకీయ సంప్రదాయాలను గుర్తుంచుకోవాలని కాముని శ్రీనివాస్ సూచించారు. తెలంగాణ సమాజం కేసీఆర్, హరీష్ రావుల నాయకత్వాన్ని గౌరవిస్తూ కవితకు కూడా రాజకీయంగా, సామాజికంగా స్థానం కల్పించిందని అన్నారు. అలాంటి నాయకులపైనే ఇప్పుడు ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఒకప్పుడు కవిత కష్టకాలంలో ఉన్నప్పుడు హరీష్ రావు అందించిన సహాయ సహకారాలను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. రాజకీయంగా విభేదాలు ఉండవచ్చు, వ్యక్తిగత అభిప్రాయాలు వేరుగా ఉండవచ్చు. కానీ గతంలో అండగా నిలిచిన వారి పట్ల కనీస కృతజ్ఞతను మరిచిపోవడం తగదని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టును మరిచిపోతే తెలంగాణకు జరిగిన మేలును విస్మరించినట్లే!కేసీఆర్, హరీష్ రావుల నాయకత్వంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వ్యవసాయ రంగానికి అందించిన ప్రాధాన్యతను కవిత గుర్తుంచుకోవాలని కాముని శ్రీనివాస్ అన్నారు. తెలంగాణలో సాగునీటి అవసరాలు, రైతుల భవిష్యత్తు, నీటి వనరుల అభివృద్ధి వంటి అంశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు కీలకమైన చర్చనీయాంశమని పేర్కొన్నారు.రాజకీయ విమర్శల పేరుతో గతంలో జరిగిన అభివృద్ధి ప్రయత్నాలను, నాయకుల కృషిని పూర్తిగా విస్మరించడం సరికాదని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల కంటే వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా కవిత తన వ్యాఖ్యలపై పునరాలోచన చేయాలని సూచించారు.వ్యక్తిగత స్వలాభం కోసం రాజకీయ విలువలను దిగజార్చవద్దు!రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ, విమర్శలకు ఒక హద్దు, రాజకీయాల్లో ఒక సంస్కారం ఉండాలని కాముని శ్రీనివాస్ అన్నారు. గతంలో కలిసి పనిచేసిన నాయకులపైనే వ్యక్తిగత ఆరోపణలు చేయడం, తెలంగాణ కోసం జరిగిన ఉద్యమాన్ని మరియు అభివృద్ధి కార్యక్రమాలను పక్కనపెట్టడం తగదని హితవు పలికారు.హరీష్ రావుపై ఆరోపణలు చేసే ముందు ఆయన గతంలో అందించిన సహకారాన్ని గుర్తుచేసుకోవాలని, రాజకీయంగా ఎంత ఎత్తుకు ఎదిగినా కృతజ్ఞతాభావాన్ని కోల్పోకూడదని అన్నారు.హరీష్ రావుకు క్షమాపణ చెప్పాలి కాముని శ్రీనివాస్ డిమాండ్హరీష్ రావుపై చేసిన వ్యాఖ్యలను కవిత పునఃపరిశీలించి, తన మాటలకు బాధ్యత వహించాలని కాముని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్వప్రయోజనాల కోసం రాజకీయ విమర్శల స్థాయిని దిగజార్చకుండా, గతంలో చేసిన సహాయాన్ని గుర్తుచేసుకొని హరీష్ రావుకు క్షమాపణ చెప్పాలని ఆయన హితవు పలికారు.ఇట్టి కార్యక్రమంలో కాముని శ్రీనివాస్, ములకల కనకరాజు, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కాముని ఉమేష్ చంద్ర, మేడికాయల వెంకటేశం, కీసరి పాపయ్య, కొండం రవీందర్ రెడ్డి, సర్పంచులు ఇట్టభోయిన శ్రీనివాస్, రేగుల దేవయ్య, మాజీ సర్పంచ్ పుచ్చకాయల సురేందర్ రెడ్డి, నాయకులు పంపరి కనకయ్య, గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, మన్నే ఆనంద్, ఎలుక నవీన్, చెట్టుపల్లి భాను, పిట్ల ప్రేమ్.

బొలెరో వాహనం నుండి నగదు చోరి చేసిన నిందితుడు అరెస్ట్



మనప్రజాప్రతినిధి //హుజూర్ నగర్ ,నవంబర్ 14:సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో శుక్రవారం జరిగిన దొంగతనం కేసును స్థానిక పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నేరేడుచర్ల పట్టణంలోని జాన్‌పహాడ్ రోడ్డులో నిలిపి ఉంచిన ఒక బొలెరో వాహనం నుండి రూ. 7,000 నగదు ఉన్న బ్యాగు చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాలు మరియు స్థానిక సమాచారం ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టి, ఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామానికి చెందిన తిరుపతయ్యగా గుర్తించారు. నిందితుడి వద్ద నుండి చోరీకి గురైన నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. తక్కువ సమయంలోనే కేసును ఛేదించి నిందితుడిని పట్టుకున్న నేరేడుచర్ల పోలీసులను ఉన్నతాధికారులు, స్థానికులు అభినందించారు.

బాలల దినోత్సవ వేడుకలు



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్:రాంపల్లి అంగన్వాడీ కేంద్రం లో బాలల దినోత్సవ వేడుకలను ఉపాధ్యాయురాలు కవిత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన జీవిత విశేషాలు, విద్యాభ్యాసం, రాజకీయ ప్రస్థానం, దేశానికి చేసిన సేవలను వివరించారు. పిల్లలపై నెహ్రూకు ఉన్న ప్రేమాభిమానాల గురించి తెలియజేస్తూ, ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బొమ్మ మల్లయ్య ,వార్డు మెబార్స్ బొమ్మ స్వామి, కొంతం శ్రీనివాస్, సీత యాదగిరి, సీత అనిత, మీస కిష్టవ్వ,కనకరెడ్డి, వీరం రెడ్డి,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఛలో సిద్దిపేట.. కాంగ్రెస్ శ్రేణుల ప్రభంజనం

మనప్రజాప్రతినిధి//నవంబర్ 14 చిన్నకోడూరు.: ఈ నెల 19వ తేదీన సిద్దిపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభను చారిత్రాత్మక విజయవంతం చేసేందుకు చిన్నకోడూర్ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ స్థాయిలో సన్నాహాలు చేస్తున్నాయని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్ ముదిరాజ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు లహరి తెలిపారు. ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రతిష్టాత్మకమైన ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఇందిరమ్మ చీరల రెండో విడత పంపిణీ పథకాలను ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రజల్లో భారీ ఉత్సాహం నెలకొందని వారు



పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గారు సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ గారి నాయకత్వంలో చిన్నకోడూర్ మండలం నుంచి దాదాపు 10 వేల నుంచి 15 వేల మంది ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను సభకు తరలించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ఇది కేవలం సభ కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పాలనకు ప్రజలు అందించే మద్దతుకు నిదర్శనం! పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే మా లక్ష్యమని తెలిపారు. నవంబర్ 19న సిద్దిపేట గడ్డపై కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేలా, చిన్నకోడూర్ మండలం నుంచి భారీ జనసందోహంతో తరలివెళ్లి సభను విజయవంతం చేస్తామని బుస్స రాజశేఖర్ ముదిరాజ్, లహరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ వినోద్,పెద్దకోడూర్ 3 వ వర్డ్ మెంబెర్ నాయిని రవి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్,చిన్నకోడూర్ మండల సీనియర్ నాయకులు అజ్జు యాదవ్, అనిల్,గుండు వెంకటేష్,రాములు,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ ఆశయాలే నవభారత నిర్మాణానికి స్ఫూర్తి

మన ప్రజా ప్రతినిధి దినపత్రిక, కొమురవెల్లి, జనగామ నియోజకవర్గం: జనగామ నియోజకవర్గం కొమురవెల్లి మండల కేంద్రంలో దేశ తొలి ప్రధానమంత్రి,ఆధునిక భారత నిర్మాత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్,ఆ మహానేతకు ఘనంగా నివాళు లర్పించారు. నెహ్రూ జయంతి రోజున జరుపుకునే 'బాలల దినోత్సవం' సందర్భంగా బాలలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహాదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ విద్య, విజ్ఞాన,శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి



ఆయన వేసిన పునాదులు భారత ప్రగతికి బాటలు వేశాయని అన్నారు. నెహ్రూ,ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమానత్వం,లౌకికవాదం,ప్రజాస్వామ్య స్ఫూర్తితో దేశ అభివృద్ధి కోసం ముందుకు సాగాలని కోరారు. ప్రతి చిన్నారిలోనూ అపారమైన ప్రతిభ, సృజనాత్మకత,నూతన ఆలోచనలు దాగి ఉంటాయని నెహ్రూ,విశ్వసించేవారని గుర్తుచేశారు. బాలల హక్కులను పరిరక్షిస్తూ,వారి ప్రతిభను ప్రోత్సహిస్తూ,భయంలేని బాల్యాన్ని అందించి,వివక్షకు తావులేని సమాజాన్ని నిర్మించాలని అన్నారు. విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే నెహ్రూ,ఆశయాలకు నిజమైన నివాళి అని మహదేవుని శ్రీనివాస్,పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు,యూత్ కాంగ్రెస్,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మర్మాముల గ్రామంలో గ్రామసభ నిర్వహించిన సర్పంచ్ సత్యనారాయణ

మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,మద్దూరు, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. మద్దూరు మండలం, మర్మాముల గ్రామపంచాయతీ లో గ్రామ సర్పంచ్.సుందరగిరి సత్యనారాయణ గౌడ్,అధ్యక్షతన బాలల గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్,పాలకవర్గ సభ్యులు బంగ్లా సరిత,అల్లిబిల్లి కరుణాకర్,సుందరగిరి సరిత,ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి,అంగన్వాడీ టీచర్లు చంద్రకళ,అనంత జయశ్రీ,మోహిని,ఆశ వర్కర్లు నాగలక్ష్మి,మన్నెమ్మ మరియు గ్రామంలోని పిల్లలు,గ్రామపంచాయతీ సిబ్బంది,పాల్గొన్నారు.



బాలబాలికలను సంరక్షించుకోవడం మందరిబాధ్యత



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,దుల్మిట్ట, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. దూల్మిట్ట మండలం, జాలపల్లి గ్రామ సర్పంచ్,సర్పంచుల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్‌బాలల హక్కులు, విద్య,ఆరోగ్యంపై ప్రత్యేక గ్రామసభ నిర్వహణ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రోజున జాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బాల బాలికల ప్రత్యేక గ్రామసభను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బాలల హక్కులు,నాణ్యమైన విద్య,ఆరోగ్యం, పోషకాహారం,పరిశుభ్రత,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,బాల్యవివాహాల నివారణ తదితర అంశాలపై చర్చించడం జరిగింది. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు,వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని సర్పంచ్ పేర్కొన్నారు. పిల్లలు తమ సమస్యలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా గ్రామసభలో వెల్లడించేలా ప్రోత్సహించడం జరిగింది. బాలల సమగ్ర అభివృద్ధికి గ్రామపంచాయతీ తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, పిల్లలకు సురక్షితమైన,ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నేటి బాలలే రేపటి భారత పౌరులు. వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం మనందరి బాధ్యత. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి,అంగన్‌వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు,ఉపాధ్యాయులు,విద్యార్థులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

70వ స్కూల్స్ ఫెడరేషన్ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బాలమణి శ్రీనివాస్

మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. జనగామ మినీ స్టేడియంలో డేబై వ స్కూల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల సెపక్ తక్రా టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ శ్రీమతి.కడకంచి బాలమణి శ్రీనివాస్,ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఛైర్పర్సన్ జ్ఞాపికలు, బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని,క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసాన్ని,క్రమశిక్షణను,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న అన్ని జిల్లాల బాలబాలికలకు,విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ,భవిష్యత్తులో రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జనగామకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, ఫెడరేషన్ సభ్యులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు,విద్యార్థులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు





ప్రజా సంఘాల సభ్యత్వాన్ని ప్రారంభించిన సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధనుంజయ నాయుడు




నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక) సిపిఐ పార్టీ మరియు ప్రజా సంఘాల సభ్యత్వాన్ని సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో సిపిఐ పార్టీకి పూర్వవైభవం వస్తున్నదని అందులో భాగంగా ఒక శాస్త్ర సభ్యుడు ఒక శాసనమండలి సభ్యులతో పాటు ఒక మేయర్ పదవి కూడా సిపిఐ కైవసం చేసుకున్నదని సింగరేణి ఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన ఆర్టీసీ ఎన్నికల్లో కూడా ఏఐటీయూసీ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల పైన ఘనవిజయశీ సాధించిందని అలాగే ప్రెస్ అకాడమీ చైర్మన్ గా కే శ్రీనివాసరెడ్డిని రెండుసార్లు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడం స్వాగతిస్తున్నామని భవిష్యత్తులో మరింత ఎక్కువ సంఖ్యలో ప్రజా ప్రతినిధులుగా సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కూడా గౌరవప్రదమైన స్థానాలు సంపాదించామని ముఖ్యంగా ఎవరితో పొత్తు పెట్టుకోకుండా కొత్తగూడెం మేయరు గెలవడం సిపిఐ చరిత్రలో ఒక కీలకమైన మైలురాయి లాంటిదని నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజల కొరకు ప్రజా సమస్యలపై మడమ తిప్పని పోరాటాలు నిర్వహించడం వల్లనే ఇవి సాధ్యమయ్యాయని మారుతున్న కాలంతో పాటు ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకొని భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించుకొని ఉద్యమాలు నిర్వహిస్తామని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం మిత్రపక్షశీ అని కూడా చూడబోమని మేము ఎప్పుడూ కూడా ప్రజల పక్షమే అని ఆయన స్పష్టం చేశారు పార్టీకి ప్రజాసంఘాలు చెట్టుకు కొమ్మలు లాంటివని అందువల్ల అన్ని గ్రామాలలో ప్రజాసంఘాల నిర్మాణం కొరకు కార్యకర్తలు శ్రమించాలని అసంఘటిత రంగ కార్మికులను సభ్యులుగా చేర్చుకొని గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని పటిష్టం చేయనున్నామని ముఖ్యంగా మేధావులు, విద్యావంతులు పార్టీ నిర్మాణానికి తగు సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు కార్యక్రమంలో మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను ఏఐటీయూసీ ప్రాంతీయ సహాయ కార్యదర్శి ముత్యాల భాస్కర్ సిపిఐ సీనియర్ నాయకులు బెల్లంకొండ గోవిందు గౌడ్ , ఏఐవైఎఫ్ నేరేడుచర్ల మండల అధ్యక్షుడు పరికె భరత్ పాల్గొన్నారు

చేర్యాల పట్టణ కేంద్రంలో దొంగల హల్ చల్

మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. చేర్యాల పట్టణం కేంద్రం లో ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఘటన కలకలం రేపినది. చోరీ జరిగిన విషయాన్ని ఎస్ఐ. అపూర్వ రెడ్డి తెలియజేస్తూ గుండేటి బాలమణి,ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీపావళి తెల్లవారి తన ఇంటికి తాళం వేసి కరీంనగర్ కి వెళ్లారు. రోజు మాదిరిగానే ఈరోజు ఉదయం పని మనిషి వచ్చేసరికి ఇంటి తాళం పగలకొట్టి ఉండగా తనకి ఫోన్ చేసి తెలిపిందని తాను వచ్చి చూసే సరికి





ఇంట్లో అంత చిందరవందరగా ఉండి పది వేల రూపాయల క్యాష్ మరియు వెండి విగ్రహాలు అందద పది హేసు తులాలు దొంగలించ బడ్డాయని తెలిపారు. అలాగే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రజకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి...



హైదరాబాద్ : మనప్రజా ప్రతి నిధి దినపత్రిక)రజకుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని, మనం ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు,రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు బిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శనివారం నాడు ఆయన పత్రికా ప్రకటన ద్వారా తెలియపరుస్తూ ..తరతరాలుగా సాంప్రదాయ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న రజకులు నేడు ఆర్థిక,సామాజిక సమస్యలను ఎదుర్కొంటు, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు వృత్తి నిర్వాణ ఖర్చులు ఆధునిక యంత్రాల కొరత రజక కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని రజకలుసాంప్రదాయ వృత్తిని కాపాడుతూ ఆధునిక కాలానికి అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రతి రజక కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని ఆయన అన్నారు.ముఖ్యమైనడిమాండ్స్ :రజకులకు ఉచిత లేదా సబ్సిడీ వాషింగ్ మిషన్లు అందించాలనిఆధునిక దోబిగాడ్లను నిర్మించాలని పట్టణాలు గ్రామాల్లో లాండ్రీ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఆర్థిక సాయం అందించాలి నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని, అర్హులైన రజక కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ప్రభుత్వాలు అందించాలిరజకుల కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలి, బ్యాంకు రుణాలు సబ్సిడీ అందించాలి. రజకుల అభివృద్ధి కేవలం హామీలకే పరిమితం కాకుండా ఆచరణలో కల్పించాలని రజకుల హక్కుల కోసం ఆత్మగౌరవం కోసం భవిష్యత్ తరాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీజేపీ ఎండోమెంట్ సెల్ సహసమన్వయకర్తగా మామిళ్ల నర్సిములు



దోమ, ప్రజా ప్రతినిధి, (నవంబర్ 14):గ్రామీణ ప్రాంతానికి చెందిన నాయకులకు పార్టీ పరంగా గుర్తింపు లభిస్తోంది. ఈ క్రమంలో దోమ మండల పరిధిలోని పాలేపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల నర్సిములుకు భారతీయ జనతా పార్టీ తెలంగాణ ఎండోమెంట్ సెల్ (ధార్మిక) విభాగంలో కీలక బాధ్యతలు అప్పగించారు. ఎండోమెంట్ సెల్ సహ సమన్వయకర్తగా ఆయనను నియమిస్తూ పార్టీ రాష్ట్ర నాయకత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు శనివారం (నవంబర్ 14) తెలంగాణ ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నవజ్జుల సూర్యప్రకాష్, కో–కన్వీనర్ నిరంజన్ దేశాయ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయాల అభివృద్ధి, ఆలయాల నిర్వహణలో సమర్థవంతమైన భాగస్వామ్యం, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు ధార్మిక కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఎండోమెంట్ సెల్ ద్వారా దేవాలయాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను గుర్తించడం, ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో సమన్వయం చేసుకోవడం, ఆలయాల పరిరక్షణకు సంబంధించిన విషయాల్లో చొరవ చూపడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని నాయకులు ఆకాంక్షించారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ధార్మిక రంగ అభివృద్ధికి కృషి చేస్తానని మామిళ్ల నర్సిములు పేర్కొన్నారు.దోమ మండలంలోని పాలేపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి పార్టీ రాష్ట్రస్థాయి ధార్మిక విభాగంలో బాధ్యతలు దక్కడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. ఆయన నియామకంతో గ్రామానికి, మండలానికి గుర్తింపు లభించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి



మన ప్రజాప్రతినిధి హుజూర్ నగర్ నవంబర్ 14:టీఎస్ యుటిఎఫ్ ఆరవ జిల్లా మహాసభలలో మాజీ శాసన మండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి ,టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆది మూలం వెంకట్.ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బలోపేతం చేయాల్సినబాధ్యత ప్రభుత్వంతోపాటు సమాజం తీసుకోవాలని మాజీ శాసన మండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు శనివారం హుజూర్నగర్ పట్టణంలోని టౌన్ హాల్ నందు టీఎస్ యుటిఎఫ్ సూర్యాపేట జిల్లా ఆరవ మహాసభలు టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్ సోమయ్య అధ్యక్షతనప్రారంభమయ్యాయిమహాసభల ప్రారంభానికి ముందు ఉపాధ్యాయుల మహా ర్యాలీ పట్టణంలోని కొత్త బస్టాండ్ నుండి టౌన్ హాల్ వరకు జరిగింది.ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మహాసభలను ప్రారంభిస్తూ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య రోజు రోజుకు తగ్గుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నమోదును పెంచాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు ప్రభుత్వము సమాజం తీసుకోవాలని సూచించారు. ఈ మధ్యకాలంలో పట్టణాలలో జనాభా పెరిగిన నేపథ్యంలో పట్టణ ప్రాంతంలో కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయాలని సూచించారు.టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు బోధనకు మాత్రమే పరిమితం చేయాలని సూచించారు ఈ మధ్యకాలంలో పాఠశాలలలో ఉపాధ్యాయులకు బోధనకు రెండవ ప్రాధాన్యత ఇస్తూ బోధ నేతర పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ పాఠశాలకు సంబంధించిన సమాచారాన్ని ఆన్లైన్లో పంపించడం గూగుల్ సీట్లు నింపడం లాంటి అనేక సాంకేతిక అంశాలకే పరిమితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాఠశాలలో బోధన కుంటుపడుతుందని తద్వారా విద్యార్థులలో నాణ్యత లోపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సిహెచ్ రాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి రెండవ పిఆర్సి కమిషన్ రిపోర్టును వెంటనే ప్రకటించి జూలై 2023 నుంచి అమలు చేయాలని సూచించారు. విద్యా సదస్సులో జాతీయ విద్యా విధానం 2020 గత ఆరేళ్ల అమలు పరిణామాలు అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఆమంచి నాగేశ్వర్ స్ఫూర్తిదాయక సందేశాన్ని ఇచ్చారు. అనంతరం జరిగిన చైతన్య సదస్సులో అమెరికా యుధోన్మాదం ప్రపంచ సంక్షోభం అనే అంశంపై ప్రముఖ సామాజిక ఆర్థిక రాజకీయ విశ్లేషకులు డాక్టర్ అందసత్యం నిర్మాణాత్మకమైన సందేశాన్ని ఇచ్చారు. ఈ మహాసభల ప్రారంభంలో జాతీయ పతాకాన్ని ఏ రాజశేఖర్ రెడ్డి ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బీరెల్లి శ్రీనివాసరెడ్డి,ఎస్ టి ఎఫ్ ఐ పతాకాన్ని జి వెంకటేశ్వర్లు టీఎస్ యుటిఎఫ్ పతాకాన్ని చెన్నా సైదులు ఆవిష్కరించారు.ఈ జిల్లా మహాసభలలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముదిరెడ్డి రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం టీఎస్ యుటిఎఫ్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఎర్ర శేఖర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి గేర నరసింహ ఎఫ్ డబ్ల్యూ ఎస్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జాగటి యాకయ్య నల్లగొండ ఖమ్మం వరంగల్ శాసనమండలి వామపక్షాల బలపరిచిన అభ్యర్థి కొల్లి సత్యనారాయణ సూర్యాపేట టీఎన్జీవో జనరల్ సెక్రెటరీ దున్నా శ్యామ్ ,తాప్రా జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నే యాదగిరి, టిఎస్పివి జిల్లా అధ్యక్షులు ఆర్ ధన మూర్తి రాష్ట్ర ఉపాధ్యక్షులు కేఏమంగ టీఎస్ యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కే అరుణ భారతి జిల్లా కోశాధికారి గుల్ల వెంకటయ్య, మండల విద్యాధికారి సైదా నాయక్, జెవివి జిల్లా అధ్యక్షులు సైదులు,జిల్లా కార్యదర్శులు ఆర్ దామోదర్,జెట్టి కమల, నాగేశ్వరరావు, ఆడం, రమేష్, రమేష్ ,సాంబయ్య, శ్రీనివాసచారి ఆడిట్ కమిటీ సభ్యులు చిక్కుళ్ళ గోవింద్, వెంకటేశ్వర్లు, హుజూర్ నగర్, మఠంపల్లి మండలాల బాధ్యులు వీ రామకృష్ణ, ప్రభాకర్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆర్ సైదులు, శ్రీనివాసరెడ్డి, జ్యోతి ,స్రవంతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

శివగంగ లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతుల డిమాండ్...




-చింతలపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద తండావాసుల కథం...

-నీటి ఎద్దడితో రోజుకో పశువు మృత్యువాత పడుతుందని ఆవేదన...

(మన ప్రజాప్రతినిధి//హుజూర్ నగర్ నవంబర్ 14:చింతలపాలెం మండలం ఎర్రకుంట తండా ఎండిపోయిన చెరువులకు తక్షణమే నీటిని విడుదల చేసి తమ జీవాధారాన్ని కాపాడాలని కోరుతూ సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం ఎర్రకుంట తండా వాసులు,రైతులు కదం తొక్కారు. శివగంకా లిఫ్ట్ ద్వారా ఎర్రకుంట తండా చెరువును నింపాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం 10 గంటలకు చింతల పాలెం మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఎల్ నేను ప్రభావం.... మూగజీవాల మృత్యు ఘోష... ఈ ఆందోళనలో పాల్గొన్న నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ ధరవత్ నరసింహ మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎల్ నినో ప్రభావం చేత వర్షాలు లేక తండాలో తీవ్రమైన నీటి కొరత ఏర్పడింది అని తెలిపారు. చెరువు పూర్తిగా అడుగంటి పోవడంతో పశువులకు గుక్కెడుతాగు నీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నీటి ఎద్దడిని తాళలేక గ్రామంలో రోజుకు ఒక పశువు మృత్యువాత పడుతుందని అన్నారు. ఈ విషయంపై అధికారులు కానీ,పాలకులు కానీ స్పందించకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఉత్తమ స్పందించకపోతే హైదరాబాద్ ముట్టడి... రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సమస్యపై తక్షణమే స్పందించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన శివగంగా లిఫ్ట్ ద్వారా ఎర్రకుంట తండా చెరువును నింపేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ మొరను ఆలకించక పోతే తండాలోని తండాలోని రైతులు అందరూ కలిసి హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద నిరవధిక ధర్నాకు కూర్చుంటామని హెచ్చరించారు. ఈ నిరవధిక కార్యక్రమంలో బంజారా, జేఏసీ నాయకులు బోడ కృష్ణ,భానోత్ నాగరాజు, భూక్య నాగుతో పాటు గ్రామ రైతులు వాంకడోత్ లావ్య,పాన్య, సామ్య,భూక్య నాగేశ్వరరావు,వాంకడోత్ రామచంద్, ధరావత్ చందు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బాలల అభ్యున్నతితోనే దేశ అభివృద్ధి
హబ్షీపూర్ సర్పంచ్ బాలెంల శ్రీలత రామచంద్రరెడ్డి



మనప్రజాప్రతినిధి//దుబ్బాక,:బాలల అభ్యున్నతితోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని హబ్షీపూర్ గ్రామ సర్పంచ్ బాలెంల శ్రీలత రామచంద్రరెడ్డి అన్నారు. శనివారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలో చిన్నారులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, పాఠశాలలో ఉన్నటువంటి ఎలాంటి సమస్యలైన తమ దృష్టికి తీసుకురావాలని. తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తామని విద్యార్థులకు తెలిపారు.నేటి బాలలే రేపటి పౌరులని, పిల్లలకు నాణ్యమైన విద్య, మంచి ఆరోగ్యం, చక్కటి నైతిక విలువలు అందించినప్పుడే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ప్రతి చిన్నారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి కలలను సాకారం చేసుకునేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్స్, చిన్నపిల్లలకి పెన్సిల్స్, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ రాజేంద్ రెడ్డి, గ్రామ సెక్రెటరీ వజ్రవ్వ,అంగన్ వాడి టీచర్స్ మంజుల,బాల్ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు



బాలల భద్రత, సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



మన ప్రజాప్రతినిధి హుజూర్‌నగర్ ,నవంబర్ 14:బాలల దినోత్సవం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నారీ సెల్ నేషనల్ కోఆర్డినేటర్, మోటివేషనల్ స్పీకర్ వీరవల్లి శ్రీలత,నారీ సెల్ రీజినల్ డైరెక్టర్ సులువ భవాని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల భద్రత, సైబర్ సెక్యూరిటీ, వ్యక్తిగత రక్షణ, క్రమశిక్షణ వంటి కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్‌లో ఎదురయ్యే ప్రమాదాల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో విద్యార్థులకు వివరించారు. అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో మాట్లాడకూడదని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. అలాగే వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు జీవితానికి అవసరమైన విలువలు, భద్రతా నియమాలు, బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం..



మనప్రజాప్రతినిధి//హైదరాబాద్: ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతరెడ్డిరాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు గారిని, బీజేవైఎం నాయకులను ముందస్తుగా అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి చల్ల శ్రీలతరెడ్డి తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని, ఆ హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే భయంతోనే ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టుల పేరుతో నిర్బంధించడం సిగ్గుచేటని విమర్శించారు.రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడం ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు. ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా నిరంకుశ వైఖరిని విడనాడి, అక్రమ అరెస్టులను ఆపాలని, అరెస్ట్ చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో బీజేపీ గొంతును నొక్కలేరు.. ప్రజాస్వామ్య పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు.